# సినీ బేతాళ కథలు

– డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

## - 8 -

## బాహుబలీయం

**విక్రమార్కుడు,** బేతాళుడి శవాన్ని మళ్ళీ తన భుజం మీద వేసుకుని నడక సాగించాడు.

‘విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా ఉండేందుకు మరోకథ చెబుతాను విను!‘ అని బేతాళుడు ప్రారంభించాడు -

‘యు.కెలో మాంచెస్టర్ దగ్గర కరుణాకరం, ఏసుపాదం అని ఇద్దరు తెలుగు ప్రాణమిత్రులున్నారు. వాళ్ళిద్దరికీ తెలుగు సినిమాలంటే వల్లమాలిన ఇష్టం. దగ్గర్లో ఉన్న తెలుగువారు టైమ్ సేవ్ చెయ్యడం కోసం కరుణాకరాన్నీ, ఏసుపాదాన్నీ - చెయ్యీ, కాలు అని పిలిచేవారు. చెయ్యి లేకపోతే కాలు కదిలేది కాదు. కాలు లేకపోతే చెయ్యి తిరిగేది కాదు. అప్పుడప్పుడు మాంచెస్టర్, ట్రఫోర్డ్ సెంటర్ మల్టీప్లెక్స్‌లో తెలుగు సినిమా ఏదో ఒకటి ఒక ఆట ఆడేది. ఆటకి ముందు ఆ తెలుగు సినిమా షో ఏర్పాటు చేసిన ఆసామీ - ‘తెలుగు సినిమా వేస్తున్నాం - రండి బాబూ!‘ అని తెలుగువారందరికీ ఫోన్లు చేసేవాడు. చెయ్యీ, కాలూ తప్పనిసరిగా వెళ్ళేవారు. కానీ హాలు నిండేదికాదు. సరికొత్త తెలుగు సినిమా ఇండియాలో రిలీజయిన రోజున వేసినా హాలు నిండేదికాదు. పైగా ఒకసారి కొత్త ‘మల్లీశ్వరి‘ చూపిస్తే - ఇదేం మల్లీశ్వరి? - మనసూ లేదు, మల్లెలూ లేవు, మాలలూ లేవు, ఊగడమూ లేదు అని సగం మంది లేచి వెళ్ళిపోయారు. తర్వాత కొత్త ‘మిస్సమ్మ‘ వేశారు. ఇదేవిటీ? ‘రావోయి చందమామా! మా వింతగాధ వినుమా‘ అని ఎక్కడా వినబడలేదు అనుకుంటూ ఇంకోసారి సగం మంది లేచి వెళ్ళిపోయారు. తర్వాత ఒక తెలుగు సినిమా చివర్లో శుభం కార్డు వేస్తుంటే ఆగిపోయింది. ప్రేక్షకులంతా పోగై హాలు మేనేజర్‌తో కయ్యానికి దిగారు - ‘ఏవయ్యా..! మీ ఆపరేటర్‌కి తెలుగు సినిమా అంటే అంత లోకువా? పిక్చరు ఫినిషవకుండా ఆపేశాడు‘ - అనడిగారు. అప్పుడు హాలు మేనేజరు ‘బాబూ! మీ తెలుగు సినిమాలు యమ్ సిక్స్ మోటార్ ‘వే‘లా ఇంత పొడుగ్గా ఉంటాయని మా ఆపరేటర్‌కి తెలియదు. తర్వాత చూపించాల్సిన ఇంగ్లీషు సినిమాకి స్టార్టింగ్ టైమ్ దాటిపోయి, జనం వెయిట్ చేస్తున్నారు. అయినా మీ సినిమా ఆల్మోస్ట్ అయిపోయింది కదా!‘ అని ఇంగ్లీషులో సంజాయిషీ చెప్పాడు.

అయినే తెలుగు ప్రేక్షక జనం వినలేదు. 'నీ ఇంగ్లీషు పిక్చరైతే ఇలాగే చేస్తావా? తెలుగంటే నీకంత లోకువా?' అని తగాదాకి దిగారు. హాలు మేనేజరు అందర్నీ క్షమించమని బ్రతిమాలుకుని, అందరికీ కోక్‌లూ, పాప్‌కార్న్ ఫ్రీగా పంచిపెట్టి, మరో సినిమా ఫ్రీగా చూడటానికి టిక్కెట్స్ ఏర్పాటు చేసి, అందర్నీ శాంతింప చేసి 'ఓ! జీసస్!' అనుకున్నాడు. ఆ తర్వాత ఆ తెలుగు సినిమా షో ఏర్పాటు చేసిన ఆసామిని పిలిచి, ఆయన కాళ్ళమీద పడి - 'బాబూ! మీకు మీ తెలుగు సినిమాలకీ ఒక దణ్ణం! ఇంక ఈ జన్మలో ఇక్కడ తెలుగు సినిమాలు వెయ్యమని అడక్కండి. మాతోటి ఎగ్జిబిటర్స్‌కి కూడా నా నిర్ణయం తెలియజేస్తాను' అని మళ్ళీ ఇంగ్లీషులో నిక్కచ్చిగా చెప్పేశాడు. అప్పట్నించీ మాంచెస్టర్‌లో తెలుగు సినిమాలు కరువైపోయాయి. కరుణాకరానికి, ఏసుపాదానికి అంటే చేతికి, కాలుకి కళ్ళు కుట్టేసినట్టయిపోయింది.

చెయ్యీ, కాలూ తెలుగు సినిమాల కోసం మొహాలు వాచి ఇద్దరి తలకాయలు బాగా సైజు పెరిగిపోయాయి. ఎన్నో నెలల తర్వాత మాంచెస్టర్లో ఒక మూల ఎక్కడో అప్పుడోసారి అప్పుడోసారి మళ్ళీ ఒక తెలుగు సినిమా ఒకే ఒక ఆట మొదలెట్టారు. కానీ ఆ థియేటర్‌కి దవారాలు చిన్నవి కావడం వల్ల తలల సైజు పెరిగిన చెయ్యీ, కాలూ మిత్రులకి ప్రవేశం అతి కష్టమై, తెర టీవీ స్క్రీన్‌లా చిన్నదై కనిపిస్తూ సినిమా ఎంత బావున్నా నరకయాతనైపోయింది.

నెలలు ఏళ్ళయి గడుస్తున్నాయి. చెయ్యీ, కాలూ తెలుగు సినిమా దొరక్క బాగా శుష్కించి పోయారు. చివరికి ఒకరోజు చేతికీ, కాలికీ ముఖాలు వికసించాయి. తెలుగు పిక్చర్ లేక ఎండిపోయిన మాంచెస్టర్ వెండితెరకి మళ్ళీ వెలిగే రోజొచ్చింది.

'బాహుబలి' తెలుగు చిత్రం ఒక ఆటవేస్తున్నామని నెట్‌లో ఎనౌన్సు చేశారు. చేతికి చైతన్యం వచ్చింది. కాలు నృత్యం చేసింది. కానీ 'బాబూ! తెలుగు సినిమా వేస్తున్నాం, తప్పకుండా రండి' అని ఎవ్వరూ ఫోన్ చెయ్యలేదు. రెండ్రోజులాగి వీళ్ళే ఫోన్ చేశారు. 'సారీ సర్! టిక్కెట్స్ అన్నీ బుక్ అయిపోయాయి. హౌస్‌ఫుల్ - లండన్‌లో వీకెండ్ చివర కూడా వేస్తున్నాం. అక్కడ కూడా హౌస్‌ఫుల్. హాలు దగ్గర కెళ్ళి ట్రై చేయండి! అని సమాధానం వచ్చింది. చేతికీ, కాలికీ చేతులూ కాళ్ళూ పడిపోయాయి. యు.కె చరిత్రలో ఒక తెలుగు చిత్రం షో ముందే హౌస్‌ఫుల్ కావడం ఇదే మొదటిసారి.

'ఇది నిజమా! కలా!' అన్నాడు చెయ్యి - అంటే కరుణాకరం. - 'కాదు కలరు సినిమాట' అన్నాడు కాలు - అంటే ఏసుపాదం.

ఇండియాలో పశ్చిమ గోదావరి తణుకులో చిట్టూరి మారుతీ హాలని ఉండేది. ఆ హాల్లో ప్రతీ ఎంట్రన్స్ దగ్గరా మెట్లుండేవి. హౌస్‌ఫుల్ రోజుల్లో - సీట్లు నిండిన పిదప మెట్లమీద కూర్చోవలెను - అని స్లైడ్ చూపించేవారు. ఈ మెట్లు మాలిన యు.కె థియేటర్స్‌లో ఆ సదుపాయం కూడా లేదు అని చింతించారు కరపాద ద్వయం.

ఏమైతేనేం లండన్ వెళ్ళి 'బాహుబలి' చూసి తీరాలని నిశ్చయించుకుని, మాంచెస్టర్ నుండి లండన్‌కి రైలు బండి కట్టించుకుని 'బాహుబలి' కోసం ఆవురావురుమంటూ బైల్దేరారు. రైల్లో, చెయ్యి, కాలుని అడిగాడు. 'ఎప్పుడూ లేనిది - మన తెలుగు సినిమాకి ఈ దేశంలో సడెన్‌గా ఏవిటీ క్రేజు?'

'ఏవుంది! 'బెన్‌హర్', 'గ్లాడియేటర్', 'ట్రోయ్' వగైరా హాలీవుడ్ చిత్రాల్ని మరిపించే మెరికలా మలిచారుట. యుద్ధాలు బాగా తీశారుట. లెక్కలేనంత మంది చావుదెబ్బలు తిని లేవకుండా పడిపోతారుట. ప్రతిప్రేక్షకుడూ బాహుబలిగా మారిపోతాడు. ***మనం తప్ప ఇతరులందరూ లేవకుండా పడిపోవడమే కదా మనిషి కోరుకునేది.*** అందుకే బాహుబలి అంత హిట్టు' - అని చెప్పాడు కాలు అనబడే ఏసుపాదం.

రైలు లండన్ చేరింది. మిత్రులిద్దరూ రైలుదిగి 'బాహుబలి'ని చూపించే థియేటర్ వైపు వెళ్ళే ట్యూబెక్కారు.

థియేటర్ చేరగానే ప్రాణమిత్రులు చెయ్యీ, కాలుకి ప్రాణం లేచొచ్చింది. హాలుముందు ఎంతోమంది తెలుగు ప్రేక్షకులు, తెల్ల ప్రేక్షకులు కలకలం లేకుండా కలకల్లాడుతున్నారు.

కరుణాకరం, ఏసుపాదం టికెట్స్ కొనడానికి వెళ్తుంటే, ఒక తెలుగాయన వచ్చి, 'ఈ సినిమా బావుబలేగదండీ?' అనడిగాడు.

కరుణాకరం, 'బావుబలికాదండీ మీ తెలుగు మండా! బాహుబలి, బాహుబలి - 'వు' కాదు 'హు'' అని బదులిచ్చాడు.

'ఇలాంటి ఎద్దుబుర్రగాళ్ళకోసవే సినిమాలో 'మహిష్మతి' అనే పేరు వాడారు.' అన్నాడు ఏసుపాదం.

'నీకెలా తెలుసు?' అడిగాడు కరం.

'ట్రైలర్ చూశాలే. ముందు టికెట్స్ తీసుకుందాం' అని పాదం సాదం కదిపాడు. అన్ని టికెట్స్ అమ్ముడైపోయాయి - చివరికి మిగిలిన ఒకే ఒక టికెట్ దొరికింది. 'ఇప్పుడెలా? మనకి మరో టికెట్ కావాలికదా!' అన్నాడు కరం.

'పోనీ - నువ్వు చూడు - నేను త్యాగం చేస్తాను.' అన్నాడు పాదం.

'అలా కుదరదు గురూ! తెర ఈ మూల నించి ఆ మూలదాకా ఉంటుంది. ఊరంత బొమ్మ ఒకవేపు నువ్వూ, మరో వేపు నేను చూసి బైటికొచ్చి కథ చెప్పు కోవాలి. అయినా మనం క్లోజ్ ఫ్రెండ్స్. ఇద్దరం కలిసే చూడాలి.' అన్నాడు కరం.

'పోనీ ఇంకో టికెట్ బ్లాకులో ట్రై చేస్తే!'

'ఇదసలే తెల్లదేశం. ఇక్కడంతా తెలుపే, బ్లాకూ గీకు జాన్తా నై.'

'మరయితే ఏం చేద్దాం?'

'అవును ఏం చేద్దాం - ఒకమ్మాయిని ఇద్దరు ప్రేమించవచ్చు. కానీ ఒక్క టికెట్‌తో ఇద్దరు 'బాహుబలి' ఎలా చూడగలరు? '

- అని బేతాళుడు తను చెప్పే కథ ముగిస్తూ అన్నాడు -

'ఓ విక్రమార్కా! - అలా ఒక టికెట్ మాత్రమే కొనగలిగిన చెయ్యీ, కాలూ - అనగా మన కరుణాకరం, ఏసుపాదం ఎలాగైతేనేం 'బాహుబలి' చూడగలిగారు. అదే షో ఎలా చూడగలిగారు? హాలు హౌస్‌ఫుల్ అయాక, బ్లాకు దొరకని యు.కె.లో ఆ ఇద్దరికీ అవాళ 'బాహుబలి' చూడ్డం ఎలా సాధ్యమైంది? చూశాక 'మేము సైతం కోట్లకోటకి పౌండ్లు కాసిని హారతిచ్చాం!' అని ఎలా పాడుకోగలిగారు?

ఈ ప్రశ్నకు నువ్వు తెలిసే సమాధానం చెప్పకపోతే నీ తల ప్రొజెక్షన్‌కి ముందు తెరలాగా వెంట్రుకలన్నీ ఊడి క్లీనయిపోయి స్టార్స్‌కి రిఫ్లెక్టర్లా అయిపోతుంది' - అని ముగించాడు.

అప్పుడు విక్రమార్కుడు ఇలా బదులిచ్చాడు -

'ఓ బేతాళా! చెయ్యీ, కాలు - అనగా కరుణాకరం, ఏసుపాదం ఒక టిక్కెట్టుతో ఇక్కట్టు పడుతూండగా ఒక అరవై ఏళ్ళ బ్రిటిష్ వనిత వారి అవస్త చూసి వారిని సమీపించింది. ఆమెకు అరవై ఏళ్ళున్నా తెల్ల పువ్వులా మెరిసిపోతోంది. ముప్పై ఏళ్ళ వయసొచ్చి వేషాలు తగ్గాక ముసలి వేషం వెయ్యమంటే ఒప్పుకుని, పడుచు మేకప్పే కావాలని మేకప్‌మేన్ ప్రాణం తీసి తయారైన వృద్ధకన్యలా ఉంది. వాళ్ళిద్దరి దగ్గరికి వొచ్చి 'మీ దగ్గర ఒకటికెట్టే ఉందా?' అనడిగింది ఇంగ్లీషులో. వెంటనే ఏసుపాదం కరుణాకరంతో, 'ఇదెవర్తో మన దగ్గరున్న ఒక్క టికెట్ కూడా కొట్టేసేలా ఉంది. దానికివ్వకు - నేనలా వెళ్ళి జనంలో ఎవడేనా ధర్మాత్ముడు టికెట్ ఇస్తాడేమో ట్రైచేసి వస్తాను. దీన్నెలాగో నువ్ టాకిల్ చెయ్యి' అని వెళ్ళి జనంలో కలిసిపోయాడు.

యు.కె వృద్ధ కన్య, కరుణాకరం దగ్గరకొచ్చి, 'హాయ్! ఇందాకణ్ణించి మీ ప్రాబ్లం వింటున్నా. నా పేరు నికొలా! అయామె గ్రేట్ ఫాన్ ఆఫ్ ఒమర్ షరీఫ్! ఆ మహానటుడు పోయారని తెలియగానే బాగా అప్సెట్ అయిపోయా. ఐ లైక్డ్ హిజ్ జెంఘిజ్‌ఖాన్, జివాగో, లారెన్స్ ఆఫ్ అరేబియా, మెకన్నాస్ గోల్డ్ - అయామ్ సో లో నౌ. అంతా బేహూబాలి ఈజ్ ఎ గ్రేట్ మూవీ అంటున్నారు. ఈ సినిమా

చూస్తే నాకు డిప్రెషన్ కొంతైనా పోతుంది అనిపించింది. ఐ కేమ్ ఆన్ మై వోన్. ఐ గాటె టికెట్. ప్లీజ్ టేకిట్! యు బోత్ ఎంజాయ్ ది మూవీ. ఐకెన్ సీ ఇట్ సమదర్ టైమ్ – యువర్ ఫ్రెండ్ గాన్ దట్‌వే. కాల్ హిమ్!'

కరుణాకరం కదిలిపోయాడు. నోటమాట రాలేదు. 'ఐ ఇన్సిస్ట్ – టేకిట్–' అని నికొలా తన దగ్గరున్న టికెట్ కరం కరంలో పెట్టింది. 'ఆర్యూ ష్యూర్?' అన్నాడు కరం. 'అఫ్‌కోర్స్ అయామ్' అంది నికొలా. కరుణాకరం తన జేబులోంచి డబ్బు తీసి టికెట్ ప్రైస్ ఆమెకు ఇవ్వబోయాడు. నికొలా – 'నో – నో డోంట్ డు దట్ – నాకు డబ్బివ్వకండి – ఇట్స్ మై ప్లెజర్' అని జనంలో కలిసి అంతర్ధానమై పోయింది. బేతాళా! నేను తెలుగులో కొంత చెప్పాను గాని నికొలా అంతా లండన్ ఇంగ్లీషే కరుణాకరంతో మాట్లాడింది.

కరుణాకరం స్థాణువై ఉండగా, ఏసుపాదం ఎగురుతూ వచ్చాడు 'టికెట్ దొరికింది గురూ – మా ఫ్రెండొకడికి యమర్జెన్సీ కాలొచ్చింది. వాడి టికెట్ పట్టాను. ఏటీ – ఆ తెల్లదాన్ని వదిలించుకున్నావా! లేకపోతే కొంపదీసి నీ దగ్గరున్న టికెట్ దానికిచ్చేశావా?' అనడిగాడు.

'ఆవిడని అదీ, ఇదీ, తెల్లది అని కల్చర్ లేకుండా మాట్లాడకు. ఆమె పేరు నికొలా – మన అవస్థ చూసి పాపం తన టికెట్ మనకిచ్చి వెళ్లిపోయింది.' అన్నాడు కరుణాకరం. అంతా విని అర్థం చేసుకున్న ఏసుపాదం – 'సారీరా! రియల్లీ సారీ! – ఇప్పుడు మనదగ్గర ఒక టికెట్ ఎక్స్‌ట్రా ఉంది. నికొలా కనబడితే ఇచ్చేద్దాం. ఎటెళ్ళింది?' అన్నాక, ఇద్దరూ నికొలా కోసం వెతకడం మొదలెట్టారు. పుష్కరంలో అక్కనుంచి విడిపోయిన తమ్ముళ్ళలా 'నికొలా – నికొలా!' అంటూ గట్టిగా పిలుస్తూ వెదికారు. కరానికీ, పాదానికీ నికొలా కనబడలేదు. ఇద్దరికీ మనసు 'నికొలమై'పోయింది.

'బాహుబలి' షో స్టార్ట్ కాబోతోంది. కరుణాకరం, ఏసుపాదం థియేటర్లోకి వెళ్లి చిత్రాన్ని తన్మయంగా చూశారు.

థియేటర్ బైట, లోపల కూడా నవరసాల మధువుతో మనసు పరవశించే అనుభవాన్ని అందించిన, గురువుని మించిన శ్రీ రాఘవేంద్రుని శిష్యుడు శ్రీ రాజమౌళి శక్తికి జోహార్లు చెప్పుకున్నారు.

'మాంచయోవ్యభిచారేణ భక్తి యోగేన సేవతే!

స గుణాన్ సమతీ త్యైథాన్ బ్రహ్మ భూయాయ కల్పతే!!'

– అచంచల విశ్వాసం, ఆత్మశక్తికి మూలం – అన్నాడోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణ భగవానుడు' అని విక్రమార్కుడు బదులు చెప్పగానే రాజుకి మౌనభంగం కలిగి బేతాళుడు తెలుగు సినిమాలా అంతర్జాతీయ చెట్టెక్కేశాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments